క్లుప్తంగా

దుకాణాల తొలగింపు



చిరు వ్యాపారులను తరలిస్తున్న పట్టణ ప్రణాళికా సిబ్బంది

విజయనగరం: నగర సుందరీకరణలో భాగంగా పట్టణ ప్రణాళికా సిబ్బంది ఆదివారం క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న కూరగాయలు, పండ్ల వ్యాపారులను అక్కడి నుంచి తరలించి వేశారు. వారికి సూచించిన స్థలాలలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అలాగే ఫుట్‌పాత్‌లను ఆక్రమించరాదని అవగాహన కల్పించారు. ప్రధాన రహదారులు కావడంతో ప్రజల రాకపోకలు, వాహనాల రద్దీ అధికంగా ఉంటాయని.. దీన్ని దృష్టిలో పెట్టుకొని రహదారి క్రమబద్ధీకరణకు తమతో సహకరించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెట్ ఆర్వీ రమణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 1వ తేదీ నుంచి డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 112 మంది జనరల్ విద్యార్థులు, 39 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

సెలవు రోజు కూడా..

- పన్ను వసూలు చేసిన నగర పాలక సిబ్బంది



పన్ను వసూళ్లలో నిమగ్నమైన నగర పాలక సిబ్బంది

విజయనగరం: మరో నెల రోజుల్లో 2024 - 25 ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో పన్ను వసూళ్లను ముమ్మరం చేశారు. నగరపాలక సిబ్బంది ఆదివారం కూడా నగరంలో పర్యటించి పన్ను వసూలు చేశారు. ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను వసూలు చేశారు. వాస్తవానికి 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు ఆశించిన స్థాయిలో జరగలేదన్న కారణంతో కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులను జారీ చేశారు. పన్ను చెల్లించని వారికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

సీతం విద్యార్థులకు స్కాలర్‌షిప్



విద్యార్థులతో ఆప్త ప్రతినిధులు

విజయనగరం అర్బన్: అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్ పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు వరించింది. విశాఖపట్నంలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ కాలేజీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్ అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ షాపులు వెలవెల



విజయనగరం గంటస్తంభం: బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. ప్రజలు భయాందోళనలకు గురికావడంతో చికెన్ కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. మాంసాహార ప్రియులు చికెన్ స్థానంలో మటన్, చేపల వైపు దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో కొద్ది రోజుల కిందట కిలో చికెన్ ధర రూ. 240 ఉండగా.. తాజాగా 140 రూపాయలకు పడిపోయింది. అయినా ఎవరూ కొనడం లేదు. అకస్మాత్తుగా విక్రయాలు తగ్గిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటే దుకాణాలకు అద్దె, సిబ్బందికి జీతాలు ఇవ్వలేమని వ్యాపారులు చెబుతున్నారు. గుడ్ల విక్రయాలు కూడా 40 నుంచి 50 శాతం మేర పడిపోయినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గుడ్ల ధర ఇదివరకు ఆరు నుంచి ఏడు రూపాయల వరకు అమ్మగా ప్రస్తుతం నాలుగు నుంచి ఐదు రూపాయలకు పడిపోయింది. మరోవైపు మటన్ ధర రూ.1000 దాటిపోగా, చేపలు కిలో రూ.170 కంటే ఎక్కువ పలుకుతుండడంతో మాంసాహార ప్రియులు చికెన్‌కు బదులు మటన్, చేపలను కొనుగోలు చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ వార్తలు విస్తృతంగా ప్రచారం కావడంతో హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లలో సైతం నాన్‌వెజ్ అమ్మకాలు 40 శాతం వరకు పడిపోయాయి.

పొంచి ఉన్న ప్రమాదం..

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు
- చాలీచాలని ఇరుకు గదుల్లోనే తరగతులు
- నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



తాళ్లపేటలో శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం

పూసపాటిరేగ: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తూ, విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించి ఆహ్లాదకర వాతావరణంలో బోధన చేపట్టిన తీరు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో చోటుచేసుకోగా.. నేడు అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. అప్పట్లో అమ్మఒడి పేరుతో విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు ఆర్థిక సాయం అందించగా.. నేటి కూటమి ప్రభుత్వం అదే పథకానికి తల్లికి వందనం పేరుతో ఇస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. దీంతో పేద, నిరుపేద విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. విద్యాకానుక కిట్లు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 223 ప్రాథమిక పాఠశాలలు, 21 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో కలిపి 296 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 9 ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు, 29 ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలతో కలిపి 53 పాఠశాలలున్నాయి. పూసపాటిరేగ మండల పరిధిలో ఐదు గ్రామాలలో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పతివాడ, తాళ్లపేట, పూసపాటిపాలెం, పసపాం, నీలగెడ్డపేట, తమ్మయ్యపాలెం, కందివలస గ్రామాలలో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయోనన్నట్లు ఉన్నాయి.



శిథిలావస్థకు చేరుకున్న పతివాడ పాఠశాల

అసంపూర్తిగా భవనాలు..

పూసపాటిరేగ కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల, పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కనిమెట్ట ప్రాథమిక పాఠశాల, గుంపాం ప్రాథమికోన్నత పాఠశాల, చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. నిధుల కొరత కారణంగా శ్లాబ్ దశలో కొన్ని.. పునాదులు వేసి గోడల దశలో కొన్ని నిర్మాణాలు మిగిలిపోయాయి.

ప్రభుత్వానికి నివేదించాం..

మండల పరిధిలో పతివాడ, పూసపాటిపాలెం, తాళ్లపేట, కందివలస, తమ్మయ్యపాలెం, నీలగెడ్డపేట గ్రామాలలో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాలు తొలగించాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. కాని ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదు. అనుమతులు వచ్చిన వెంటనే తొలగిస్తాం.

– రాజ్‌కుమార్, ఎంఈఓ – 1, పూసపాటిరేగ మండలం

అటకెక్కిన తల్లికివందనం..

నెల్లిమర్ల నియోజకవర్గంలో 349 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 34,003 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 23,712 మంది విద్యార్థులు.. ప్రైవేట్ పాఠశాలల్లో 10,191 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఏడాదికి రూ. 15 వేలు తల్లికి వందనం పేరుతో ఇస్తామన్న కూటమి నాయకులు నేడు ఆ ఊసే ఎత్తడం లేదు.

గాదె శ్రీనివాసులనాయుడికే మద్దతు



నినాదాలు చేస్తున్న బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు

- బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ, మైనారిటీ, బలహీనవర్గాల ప్రతినిధిగా పోటీలో ఉన్న పీఆర్‌టీయూ అభ్యర్థి డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడుకు బీసీ ఐక్యవేదిక మద్దతు ప్రకటించింది. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో రెండుసార్లు ప్రాతినిథ్యం వహించిన శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయ, అధ్యాపక హక్కులను కాపాడడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు. మరోసారి ఆయన్ను ఎన్నుకుంటే విద్యారంగం బలోపేతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రౌతు గోపి, రవీంద్రనాయుడు, ఆల్తి రాంబాబు, వై.శంకరనాయుడు, రౌతు రాము, విశ్వేశ్వరరావు, కంది గోపి, మధు, రావాడ రాంబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్




ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఫార్మసీ గది వద్ద ఏర్పాటు చేసిన రెయిలింగ్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రెయిలింగ్ లేకపోవడం వల్ల మందులు తీసుకోవడానికి రోగులు ఇబ్బంది పడుతున్నారనే అంశంపై సాక్షిలో ఈనెల 20న 'మందులు తీసుకోవడం కష్టమే' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి ఫార్మసీ వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేశారు.

ముచ్చటైన అక్షరాలు..
మెరుగైన ఫలితాలు..

- అందమైన చేతిరాతతో శతశాతం మార్కులకు అవకాశం
- పది, ఇంటర్ విద్యార్థులు దస్తూరిపై దృష్టి సారించాల్సిందే



ఈ విధమైన చేతిరాతతో అధిక మార్కులకు అవకాశం

విజయనగరం: సరైన సమాధానం రాసినా.. పేపరు దిద్దేవారికి అర్థమైనప్పుడే నూరు శాతం మార్కుల సాధనకు అవకాశం ఉంటుంది. ఇందుకు చక్కటి దస్తూరి కొంతవరకు దోహదపడుతుంది. ఎంత బాగా చదివి, రాసినా దస్తూరీ అర్థం కాకుంటే సమాధాన పత్రాలను దిద్దేవారికి కొంత ఇబ్బందిగా ఉంటుంది. ఆ ప్రభావం మార్కులపై పడుతుంది. అందమైన చేతిరాత విద్యార్థుల భవితను నిర్దేశిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు గజిబిజిగా కాకుండా అర్థమయ్యేలా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు . కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చేతిరాతపై పట్టు సాధించవచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు. త్వరలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తున్నారు. కొట్టివేతలు లేకుండా, చక్కగా రాసే అలవాటు చేసుకోవాలి.

చేతిరాతలో ఈ అంశాలు ముఖ్యం

- ముఖ్యంగా అక్షరాల పరిమాణం ఒకేలా ఉండేటట్లు చూసుకోవాలి.
- అక్షరాలు, పదాల మధ్య సమాన దూరం ఉండాలి.
- అక్షరాలను ఒకే గీతపై వరుసుగా ఉండేలా చూసుకోవాలి.
- తప్పుల్లేని విధంగా ఒత్తులను సరిగా వినియోగిస్తూ రాయాలి.
- కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకూడదు. ఇవి చూసే వారికి, సమాధాన పత్రం దిద్దేవారికి ఇబ్బందిగా అనిపించే అవకాశం ఉంది.
- సాధనతో వేగంతో కూడిన రాతకు ప్రయత్నించాలి.

తలరాతను మారుస్తుంది..

విషయం ఏదైనా ముత్యాలు వంటి అక్షరాలను చూస్తే చదవాలనిపిస్తుంది. సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా చేతిరాత ప్రాధాన్యం ఎన్నటికీ తగ్గదు. మెరుగైన చేతిరాతతో వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేసుకోవచ్చు. అందమైన దస్తూరి ద్వారానే భావాన్ని వ్యక్తీకరించగలం. ఉపాధ్యాయుడు ఏ అక్షరం వద్ద విద్యార్థి తప్పు రాస్తున్నాడో గుర్తించి సరిచేస్తే, విద్యార్థి మళ్లీ ఆ తప్పు చేయడు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా చేతి రాత మెరుగుపరచుకోవడం ఏమంత కష్టం కాదు.

శిక్షణ ఇస్తున్నాం..

పదో తరగతి విద్యార్థులు అందమైన దస్తూరితో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. ఎంత చదివినా, సమాధానం ఎంత బాగా రాసినా విషయం ఉపాధ్యాయుడికి అర్థం కాకపోతే తగిన మార్కులు సాధించడం కష్టం. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు దస్తూరిపై శిక్షణ ఇస్తున్నాం..

– ఎం.మరళీధరరావు, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ పాఠశాల

ప్రకృతి సేద్యం...
ఆరోగ్య భాగ్యం

- ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులతో ఆరోగ్యం
- మెరకముడిదాం మండలంలో విస్తరిస్తున్న ప్రకృతి సేద్యం
- సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల పంటలకు భలే గిరాకీ



కూరగాయలు



యాడిక గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బహుళ పంటల సాగు

మెరకముడిదాం: పంటల సాగులో మితిమీరిన రసాయన ఎరువులను వినియోగించడం వల్ల ఆపంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు అధికంగా ఉండడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తుండడంతో ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ లభిస్తోంది. ఈనేపథ్యంలో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవ సాయం వైపు మొగ్గు చూపిస్తున్నారు. మెరకముడిదాం మండ లంలో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తోంది. యాడిక,గరుగుబిల్లి, సాతాంవలస, భీమవరం, తదితర గ్రామాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. రైతులు సుమా రు 36 ఎకరాల్లో బహుళ పంటల విధానంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలను సాగు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులను వాడుతూ పంట ల ను తెగుళ్ల బారినుంచి కాపాడుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. స్వచ్ఛమైన పంట ఉత్ప త్తులు కావడంతో వీటికి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. మండలంలోని రైతులు ప్రకృతిసేద్యం ద్వారా సాగుచేసిన కూరగాయలను 'ప్రకృతి వనం' అనే పేరుతో యాడిక గ్రామానికి చెందిన శంకర రావు సేకరించి వాటిని దగ్గరలో ఉన్న చీపురుపల్లి, గరివిడి, రాజాం పట్టణాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు.

చేదోడు వాదోడుగా..

ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పంటలకు కావాల్సిన పోషకాలు, తెగుళ్ల, చీడపీడ ల నివారణకు రసాయన ఎరువుల స్థానంలో వినియోగించాల్సిన ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు, ఫల పత్రదావణాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో సామూహికంగా కషాయాలు, జీవామృతాలు, ఫల పత్ర ద్రావణాలు తయారు చేయించడంతో పాటు వాటిని వినియోగించే విధానాన్ని వివరిస్తున్నారు.



జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతు

రెండు ఎకరాల్లో సాగుచేస్తున్నా..



రెండు ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల పంటలను సాగుచేస్తున్నాను. ఈ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.పంట ఉత్పత్తులను ఇంటి అవసరాలకు వినియోగించడంతో పాటు మిగిలిన వాటిని మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. ఈ విధానంలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలకు మంచి ధరలు పలుకుతున్నాయి. ప్రజలకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందించాలనే లక్ష్యంతో ప్రకృతి సేద్యం చేస్తున్నాం. చుట్టు పక్క గ్రామాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుల నుంచి కూరగాయలను సేకరించి చీపురుపల్లి, గరివిడి, రాజాం, అప్పుడప్పుడు విజయనగరం సరఫరా చేస్తున్నాం.

– ఎలకల శంకరరావు, రైతు,యాడిక గ్రామం

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చీపురుపల్లి శాసనసభ్యుడు కళా వెంకటరావు ఒక హైస్కూల్‌కి వెళ్లి ఏకంగా హెడ్‌మాస్టర్ కుర్చీలో కూర్చొని తెలుగు దేశం బలపర్చిన అభ్యర్థికి ఓటు వేయండని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయమై నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పీటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

చట్టసభల ఔన్నత్యాన్ని పెంచాలి..



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

విజయనగరం అర్బన్: మేధావుల చట్టసభల ఔన్నత్యాన్ని పెంచాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఎవరైనా ఔన్నత్యాన్ని తగ్గించే రాజకీయం చేస్తే అటువంటి వారిని ఓటర్లు తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగిన ప్రత్యర్థిని కూటమి ప్రభుత్వం తమ అభ్యర్థిగా ప్రకటించి తగదన్నారు. మేధావుల సభ ఔన్నత్యాన్ని ఓటరు కాపాడాలని కోరారు. విద్యారంగంలో అభివృద్ధి తిరోగమన సంస్కరణలను కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందని, దాన్ని నిలదీయడానికి పీడీఎఫ్ అభ్యర్థులను మండల సభ్యులుగా పంపాలని పిలుపునిచ్చారు. విద్యారంగాన్ని బలహీనపరుస్తున్న యాప్‌ల రద్దు కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.రాము, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జేవీవీఆర్‌కే ఈశ్వరరావు, సీహెచ్ తిరుపతినాయుడు, సత్యనారాయణ, కె.అప్పారావు, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.